

## ఈ మాటల అర్థమేమిటి సారూ..




-రెండు లక్షల పైన రుణమాఫీ ఉన్నట్లా..? లేనట్లా..?
-రైతుల్లో తీవ్ర చర్చ

2లో

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 03 | డిసెంబర్ | 2024
పేజీలు 8

### జిల్లా ఉద్యమంపై
## చెరగని సంతకం పోటు

### మన కర్తవ్యాన్ని నిర్వర్తించటమే సరైన నివాళి




ప్రజాపక్షం/ఖమ్మం : అప్పటి ఉమ్మడిజిల్లా ఉద్యమం పైన, తర్వాత అవశేష ఖమ్మంజిల్లా ఉద్యమం పైన అమర జీవి పోటు ప్రసాద్‌ది చెరగని ముద్ర. పార్టీ కార్యదర్శిగా అత్యంత కీలకంగా వ్యవహరిస్తూ మొత్తం యంత్రాంగాన్ని కార్యోన్ముఖులను చేస్తున్న వేళ నవంబర్ 27న అకస్మికంగా మృతి చెందారు. పోటు ప్రసాద్ జీవితం నేటి ఆదర్శం అనడంలో సందేహం లేదు. నిండైన రూపంతో కనిపించే ఆయన ఎదను తట్టి లేపితే చాలు ఉద్యమ చరితలు పుంఖాను పుంఖాలుగా బయటకు వస్తాయి. ఆయన సహనశీలి. అదే సమయంలో ఆవేశపరుడు. ఆయనకు వ్యక్తిగతంగా నష్టం జరిగేటప్పుడు ఎంతో సహనాన్ని ప్రదర్శించి ప్రత్యర్థుల నుంచి మార్పు కోరుకుంటాడు. అదే పార్టీ కార్యకర్తకు అవమానం జరిగినా, చిన్నదెబ్బ తగిలినా ఎదుటి వారు ఎవరన్నది చూడడు. అగ్గిమీద గుగ్గిలు అవుతాడు. ఎంతటి వారైనా నిలదీయక మానడు. ఆ తత్వమే ఎంతో మంది యువకులను ఆయన దరిచేర్చి ఆత్మీయులుగా మార్చింది. అధ్యయనం చేయడమే కాదు ఆ విషయాలను నేటి తరానికి తెలియజేయడంలోనూ ఆయన దిట్ట. పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడంలోనూ ప్రసాద్‌ది ఒక ప్రత్యేక శైలి. తాను చేస్తూ ఇతరుల చేత పార్టీ పనిచేయించడం ఆయన శైలి. నాలుగు సంవత్సరాల పది నెలల కాలం పాటు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ప్రసాద్ జిల్లా పార్టీలో కదలిక తీసుకు వచ్చి క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేశారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

మిగతా 2లో..

## ముంచెత్తిన ఆర్థిక సంక్షోభం

-కుప్పకూలుతున్న వ్యాపార వాణిజ్య సంస్థలు
-ఒక్కొక్కరుగా ఐపి వైపు
-లబోదిబోమంటున్న రుణదాతలు



ప్రజాపక్షం/ఖమ్మం : రియల్ ఎస్టేట్‌లో ఏర్పడిన మందగమనం వ్యాపారాల్లో వస్తున్న నష్టాలు వెరసి ఖమ్మం నగరంలో అత్యున్నతమనుకున్న వ్యాపార వాణిజ్య సంస్థలు సైతం కుప్పకూలుతున్నాయి. పెద్ద పెద్ద సంస్థలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి దివాళావైపు పరుగులు పెడుతున్నాయన్న విస్తృత చర్చ సాగుతుంది. గడిచిన ఐదేండ్లుగా ఖమ్మంలో ఎన్నడులేనంతగా దివాళా పిటిషన్లు దాఖలవుతున్నాయి. అట్టడుగు నుంచి ఖమ్మంలో తమ వ్యాపారాలతో ఉన్నత స్థాయికి ఎదిగిన అనేక సంస్థల ఆర్థిక పరిస్థితి గందరగోళానికి గురి చేస్తుంది. ఆస్తుల సంగతేమో కాని అప్పులు కోట్లలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. రుణదాతలు ఈ వార్తలు వింటూ లబోదిబోమంటున్నారు. రియల్ ఎస్టేట్ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లినప్పుడు అందిన కాడల్లా అప్పులు చేసి ఆస్తులు కొనుగోలు చేశారు. ఆ అప్పులతోనే కొన్ని సంస్థలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు రియల్ ఎస్టేట్ ఢమాల్ అనడంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకోవడమో లేదంటే ఐపి దాఖలు చేయడమో తప్ప మరో మార్గం కనిపించడం లేదు. అప్పట్లో కోట్లు పెట్టి కొన్న ఆస్తిని ఇప్పుడు సగం ధరకు కూడా కొనే పరిస్థితులు లేవు. ధర సంగతి దేవుడెరుగు అసలు కొనేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. తెచ్చిన అప్పులు వడ్డీ అసలును మించిపోతుంది. ఇటువంటి పరిస్థితుల్లో కుటుంబ కలహాలు కూడా తోడవుతున్నాయి. ఆస్తులు పంచుకోవడమే తప్ప అప్పుల బాధ్యత తీసుకునే పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు లేకపోవడంతో

మిగతా 2లో..

### రానున్న పది రోజుల్లో
## ఇందిరమ్మ ఇళ్లు



ప్రజాపక్షం/భద్రాచలం ః రానున్న పది రోజుల్లో ఇందిర్మ ఇళ్ల మంజూరీ ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఇల్లెందు నియోజకవర్గంలో ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసిన ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం 15.38 కోట్ల అంచనాలతో చేపట్టను

- మంత్రి పొంగులేటి
- రూ..15.38 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మిగతా 2లో..

## సాగునీరు అందించేందుకు కృషి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతుల పొలాలకు సాగునీటిని అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదనపు కలెక్టర్ డా॥పి. శ్రీజతో కలిసి పర్యటించారు. ఉపాధి హామీ నిధులతో శివాయిగూడెం గ్రామంలో రూ.21.50 లక్షలతో చేపటే సిసి రోడ్ల నిర్మాణానికి, పువ్వాడ నగర్‌లో రూ.78 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు, మంచుకొండ గ్రామంలో రూ.1.34 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ గ్రామంతో అనేక సంవత్సరాలుగా తనకు పరిచయం

-సంక్రాంతికి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
-రూ. 500 కోట్లతో రఘునాథపాలెం మండలాభివృద్ధికి చర్యలు
-ఆయిల్ పాం సాగుతో సాఫ్ట్‌వేర్ కంటే అధిక ఆదాయం
-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల

మిగతా 2లో..

# ముంచెత్తిన ఆర్థిక సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ పెద్దలు తీవ్ర వేదనకు గురవుతున్నారు. సామాన్య వ్యాపారి కోట్లకు ఐపి పెడితే ప్రతి ఏడాది వందల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిపే సంస్థలు నష్టపోతే ఏ మేరకు ఐపి దాఖలు చేస్తారో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మంలో ఒక ప్రముఖ వ్యాపార సంస్థ వందల కోట్లలో నష్టపోయిందని కేవలం కాగితాలపై రాసి తెచ్చిన అప్పులే రూ.100 కోట్లు ఉన్నాయని ప్రచారం జరుగుతుండగా దీనికి ఊతమిచ్చినట్లు ఆ సంస్థలు మూత పడ్డాయి. ఈ క్రమంలోనే ఖమ్మంలో మరో వ్యాపార సంస్థకు చెందిన పెద్ద ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త దావనంలా వ్యాపించింది. రుణదాతలు నెల రోజులుగా ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని పెద్ద మొత్తంలో రుణాలు ఉన్నాయన్న చర్చ సాగుతుంది. గతంలో సైతం ఇలా స్థాయికి మించి వ్యాపారాలు నిర్వహించి నష్టపోయి ప్రాణాలు పొగొట్టుకున్న ఘటనలు విధితమే. ఇప్పుడు ఖమ్మం నగరంలో ఈ ఐపిల వ్యాపారం తీవ్ర చర్చనీయాంశమైంది. కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు, వివిధ వ్యాపార వాణిజ్య సంస్థలు, మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించే వారు ఐపి పెట్ట నున్నారని వీరికి ఇప్పటికే పెద్ద మొత్తంలో రుణాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. మొత్తంగా ఆర్థిక సంక్షోభం తదనంతర పరిణామాలు ఏ పరిస్థితికి దారి తీస్తాయోనన్న చర్చ సాగుతుంది.

# జిల్లా ఉద్యమంపై చెరగని సంతకం పోటు

(మొదటిపేజీ తరువాయి)

సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు, జిల్లా ఇంచార్జి బాగం హేమంతరావు ల సూచనలు, సమన్వయంతో కార్యక్రమాల్లో వేగం పెంచారు. శతబ్ది ఉత్సవాల నిర్వహణ, సభ్యత్వ పునరుద్ధరణపై దృష్టిసారించి ముందుకు వెళ్తున్న క్రమంలో పోటు ప్రసాద్ హఠాన్మరణానికి గురయ్యాడు. కమ్యూనిస్టు పార్టీకే కాదు ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. సత్యశీలతతో పనిచేస్తే మరణం ఓ చరిత్రే అని ప్రసాద్ రుజువు చేశారు. కమ్యూనిస్టు కుటుంబాలు ప్రసాద్ మరణంతో దిగ్భ్రాంతికి గురయ్యాయి. జిల్లా పార్టీకి ఇది సంక్లిష్ట దశ. కమ్యూనిస్టు పార్టీ క్యాడర్‌లో మనో ధైర్యం నింపి మళ్లీ క్రియశీలతపై పయనించేలా చేయాలి. పార్టీ నిర్మాణ బాధ్యతలతో పాటు శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అందరి కర్తవ్యం కావాలి. పుట్టిన మనిషి గిట్టక తప్పదు గిట్టిన వారి ఆశయాలు లక్ష్యాల కొనసాగింపే సరైన నివాళి అన్నది ప్రతి కార్యకర్త గుర్తెరగాలి. కమ్యూనిస్టులంగా ఓ లక్ష్యం వైపు పయనిస్తున్నప్పుడు అటుపోట్లు తప్పక పోవచ్చు. ప్రసాద్ మరణం కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా సమితికి ఓ పెద్ద కుదుపు. దీనిని అధిగమించి ముందుకు సాగడం కమ్యూనిస్టు కార్యకర్తల బాధ్యత. నిస్వార్థ పరుడిగా పార్టీ కార్యక్రమాలు తప్ప మరో ధ్యాస లేని అమరజీవి ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావడమే ఆయనకిచ్చే సరైన నివాళి. జిల్లా ఉద్యమంపై పోటు ప్రసాద్ చెరగని ముద్రకు మరింత మెరుగులు దిద్దుదాం.

# సాగునీరు అందించేందుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. రైతాంగం పేద ప్రజల కోసం భగవంతుడు తనకు ఇచ్చిన శక్తి మేరకు కృషి చేస్తున్నానని మంత్రి తెలిపారు. ఖమ్మంజిల్లాలో ముందు సాగు నీరు తర్వాత రహదారులు, విద్య, వైద్యం అభివృద్ధికి బాధ్యతలు తీసుకుని జిల్లా సస్య శ్యామలంగా ఉండేవిధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఖమ్మంజిల్లాలో రైతుల పొలాలకు సాగునీటిని అందించేందుకు అవసరమైన చెరువుల పునరుద్ధరణ, ఎత్తిపోతల పథకం, కాలువల నిర్మాణం చేశామని తెలిపారు. గోదావరి జలాలను ఖమ్మంజిల్లాకు తీసుకు వస్తే తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన ప్రజల రుణాన్ని తీర్చుకున్నట్లవుతుందన్నారు. ముఖ్యమంత్రిని ఒప్పించి పెండింగ్ పంపు పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు బుగ్గవాగు కాలువ పనులు మంజూరు చేసినప్పటికీ ఆ పనులను కాంట్రాక్టర్లు చేయలేకపోయారని మంత్రి తుమ్మల తెలిపారు. రఘునాథపాలెం మండంలోఉన్న చెరువులను నింపేందుకు సాగర్ నీటిని తీసుకు రావాలని భావించి రూ. 66 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. దీని ద్వారా 36 చెరువులు నింపేటట్లు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. సంక్రాంతికి వి. వెంకటాయపాలెం సాగర్ డిప్ కట్ వద్ద మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తామని వేసవి పూర్తయ్యేలోపు ఈ ప్రాజెక్టును పూర్తి చేసి చెరువులను నింపేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 500 కోట్లతో రఘునాథపాలెం మండల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రతి ఇంటికి మంచినీరు, సాగునీటి వసతి కల్పిస్తామన్నారు. మండలంలో పెద్ద ఎత్తున ఆయిల్ పాం పంట సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్ పాం పంటకు కోతులు, అకాల వర్షాల వంటి



సమస్యలు ఉండవని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే అధికంగా రైతులు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎవరైనా అర్హులకు పథకాలు అమలు కాకపోతే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని, డైట్, కాస్మోటిక్ చార్జీలు గణనీయంగా పెంచామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్‌బిఎస్ఈ హేమలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పిఆర్ఈఈ వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్, నల్లమల వెంకటేశ్వరరావు, బాలాజీ నాయక్, కొంటెముక్కుల నాగేశ్వరరావు, మారం కరుణాకర్‌రెడ్డి, వాంకుడోత్ దీపక్ నాయక్, పలువురు నాయకులుపాల్గొన్నారు.

# ఈ మాటల అర్థమేమిటి సారూ..

ప్రజాపక్షం/ఖమ్మం : హామీ ఇచ్చినట్లుగానే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేశామని నూరు శాతం రుణమాఫీని అమలు చేసిన ఘనత తమదేనని ముఖ్యమంత్రి ఆదివారం ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతుల్లో తీవ్ర చర్చ సాగుతుంది. ఆగస్టు 15 నాటికి 22.22 లక్షల మంది రైతుల రుణమాఫీ చేశామని మిగిలిన 3.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో శనివారం రూ.2741 కోట్లు వేశామన్నారు. దీనితో ఇప్పటి వరకు 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21వేల కోట్లు జమ చేశామని దీనితో రుణమాఫీ నూరుశాతం పూర్తయిందని చెప్పడంతో రెండు లక్షల పైన రుణ మున్న రైతుల రుణాలకు సంబంధించి మాఫీ ఉన్నదా లేదా అన్న మీమాంస నెలకొన్నది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని రెండు లక్షల పైన ఉన్న రుణాలకు సంబంధించి రెండు లక్షలు పైబడిన మొత్తాన్ని రైతులు చెల్లిస్తే తాము రెండు లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహా రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులు పలు సందర్భాలలో రెండు లక్షల పైబడిన రుణాలకు సంబంధించి పూర్తి స్పష్టత ఇచ్చారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని రెండు లక్షల లోపు రుణాలను ఏవిధంగా విడతల వారిగా చేశామో రెండు లక్షల పైబడిన రుణాలను కూడా విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రులు ప్రకటించారు. కాని శనివారం నాటి ముఖ్యమంత్రి ప్రకటన అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు, రుణమాఫీ పూర్తి చేసినట్లు అంటే ఇక భవిష్యత్తులో రుణమాఫీ లేనట్లేనా, రెండు లక్షలపైబడి రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ వర్తించదని వారి ఖాతాల్లో జమ చేసే ప్రసక్తే లేదని పరోక్షంగా తెలిపినట్లా అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. రైతులు తమను మోసం చేశారనే భావనలో రైతాంగం ఉంది. నిన్న మొన్నటి వరకు తప్పకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు పూర్తి చేశామని చెప్పడం దేనికి సంకేతమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డీలు మరింతగా పెరిగి రైతులు రుణాలు రికవరి కాక బ్యాంకులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు



(మొదటిపేజీ తరువాయి)

చేపట్టనున్న పలు బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తొలూత సింగ్య తండా నుండి గొల్లగూడెం వెళ్లే 2.2 కి.మీ రహదారి, ఎర్రాయిగూడెం నుండి చింతలకట్ట వరకు రహదారి, దాసు తండా నుండి ఎర్రబోరు వరకు 3.8 కి.మీ రహదారి పనులకు, బొడ్డుగూడెం నుఉండి ఉలవచిలక వరకు నిర్మించనున్న ఎస్‌టిఎస్‌టిఎఫ్ నిధుల రూ.15.38 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శంకు స్థాపన చేసిన పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హులన పేదలకు రానున్న పదిరోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేస్తారన్నారు. మండలం గంగారంలోని ప్రభుత్వ గిరిజన వసతి గృహాన్ని మంతిర ఆకస్మికంగా తనిఖీ చేసి వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారపదార్థాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, చదువుకునేందుకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని హెచ్ఎంను ఆదేశిస్తూ విద్యార్థులు నిద్రించేందుకు బెడ్లు కొరత ఉంటే తెలియజేయాలన్నారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు తెచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించిన ఆయన పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని తహాశిల్దార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివా, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, ఆర్‌అండ్‌బి ఇఇ ఇ.వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, మహిళా శిశు సంక్షేమాధికారి లెనినా, మిషన్ భగీరధ ఇఇ తిరుమలేష్, నళిని, జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి



## పూసలపాడు సొసైటీ ఎదుట రైతులు నిరసన

ప్రజాపక్షం/వైరా: రైతులందరికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎలాంటి మినహాయింపు లేకుండా రూ.2లక్షలు రుణమాఫి చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వైరా మండలం పూసలపాడు సొసైటీ ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేసి సీఈవో కృష్ణకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాస రావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రూ.2లక్షలు రుణమాఫి పూర్తయిందని, రూ.2లక్షలు పైన ఉన్న రైతులకు తర్వాత విడతల వారీగా చేస్తామని ప్రకటించడంతో రూ.2లక్షలు లోపు బ్యాంకు రుణం ఉన్న రైతులకు రుణమాఫి కాక గందరగోళం ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు పేరులో టెక్నికల్‌గా అక్షర దోషాలు ఉంటే రుణమాఫి జాబితాలో పేర్లు లేకుండా చేశారన్నారరు. ఒక రైతు ఆధార్ నెంబర్ మరో రైతు బ్యాంకు అకౌంటు నెంబర్‌తో లింక్ చేశారు అని లాంటి రైతులకు కూడా రుణమాఫి చేయలేదన్నారు. ఇలాంటి టెక్నికల్ సమస్యలు పరిష్కారం చేసి వెంటనే రైతుల అకౌంటుకు రుణమాఫి సొమ్ము జమచేయాలని కోరారు.త ల్లిదండ్రులు పేరుతో పట్టాదారు పాస్ పుస్తకం ఉండి బ్యాంకులో వారి పేర్లతో అప్పు ఉండి అట్టి భూమి బిడ్డలు పేరుతో బదలాయింపు జరిగితే భూమి లేదనే పేరుతోరుణమాఫి చేయలేదన్నారు. గత కాలంలో పహణి నకలపైన పంట రుణాలు పొందిన రైతులకు కూడా రుణమాఫి వర్తించలేదని, రూ.2లక్షలు పైన అప్పు ఉన్న రైతులు బ్యాంకులకు పైన ఉన్న మొత్తం అప్పు చెల్లించారని అన్నారు. అనేక గ్రామాల్లో రైతులు రెండు లక్షల లోపు బ్యాంకు రుణం ఉన్న కూడా రుణమాఫి వర్తించలేదని అంటున్నారని ప్రభుత్వం ప్రతి రైతు బ్యాంకు అకౌంటుని క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు ఎలాంటి మినహాయింపు లేకుండా రుణమాఫి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు మొక్కా గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, గాలి సాంబశివరావు, నల్లమల కోటేశ్వరరావు, రాధయ్య, తుమ్మల నాగేశ్వరరావు, రాజు, రాజారావు, ప్రేమసాగర్, జగదీస్, యనమద్ది రామకృష్ణ, గుడిదె రాంబాబు, శీలం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్‌డైరెక్టర్ కలిసి గోపాలమిత్ర అసోసియేషన్

ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా పశువర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కె.వెంకటనారాయణని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించిన ఖమ్మం జిల్లా గోపామిత్రఅసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి డి.శేషగిరిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు కృష్ణయ్య, కమిటీ సభ్యులు ఈ.ప్రభాకర్, జెకె.ప్రసాద్, షేక్ సుభాని పాల్గొని జెడిని సన్మానించడం జరిగింది.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డేను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లో చేయూత పింఛన్లు, సదరం సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదుల సహాయ కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన క్రింద శిక్షణ పూర్తి చేసుకున్న లబ్దిదారులకు బ్యాంకర్లు లోన్ల విషయంలో ఇబ్బందులుపెడుతున్నారని వీటిని పరిష్కరించి లబ్దిదారులకు రుణాలు త్వరగా మంజూరయ్యేలా చూడాలని దరఖాస్తు చేశారు. బోనకల్ మండలంకు చెందిన సిపిఐ(ఎంఎల్)ఎన్డి ప్రతినిధులు మండల కేంద్రంలో ఉన్న మూడు మద్యం దుకాణాల్లో మద్యం అధిక రేట్లను అరికట్టాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం వేణుగోపాల్ నగర్‌కు చెందిన ఎం. వెంకటనర్సమ్మ తన ఇంటికి ఆన్‌లైన్ పన్ను జనరేట్ కావడం లేదని, ఇంటి నెంబర్ కూడా తప్పుగా నమోదైందని వాటిని సరిచేయాలని దరఖాస్తులో కోరారు. తిరుమలాయపాలెం మండలం రమణతండాకు చెందిన ఎం. సునీత తాను ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నానని ఆరోగ్య సమస్యల వల్ల మధ్యలో విధులకు హాజరు కాలేదని ప్రస్తుతం ఆరోగ్యం కుదుట పడిందని మరోసారి తనకు ఆశా వర్కర్‌గా విధుల్లో చేర్చుకోవాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోటేశ్వరరావును పరామర్శించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూకారపు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అమెరికాలో చికాగో నగరంలో దుండగుల కాల్పుల్లో కోటేశ్వరరావు కుమారుడు సాయితేజ హత్యకు గురైన ఘటన విధితమే. ఇట్టి విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం రాపర్తి నగర్‌లోని నూకారపు కోటేశ్వరరావు స్వగృహంకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సాయితేజ అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు. తానా బాధ్యులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌లో మాట్లాడి సాయితేజ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకు వచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. సాయితేజ మృతిపట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

# రోశయ్య వర్ధంతిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకుగాను ఆర్యవైశ్యులందరు కదిలిరావాలని ఆ సంఘం నాయకులు కొణతం ఉమాశంకర్ , గ్రంధి ప్రవీణ్ , మిట్టపల్లి శ్రీనివాస్ , అనుమాల కృష్ణ ప్రసాద్ , పసుమర్తి శంకర్‌రావు , జివ్వాజి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిఎం రేవంత్ రెడ్డిని హాజరుకావాలని ఆర్యవైవ్య కోర్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత ఆహ్వానించారని తెలిపారు. కావున అధిక సంఖ్యలో ఆర్యవైశ్యలు రావాలని ఖమ్మం జిల్లా నుంచి వచ్చేవారికి ఉచిత బస్సు సౌకర్యం , భోజన వసతి కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 4 న జరిగే ఈకార్యక్రమానికి వైరా , కొణిజర్ల , ఖమ్మం నుంచి ఉదయం 6 గంటలకు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# మొక్కజొన్న రైతులు అగ్రిమెంటు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విత్తన మొక్కజొన్న వేసే రైతులు సంబందిత కంపెనీనుంచి తప్పకుండా అగ్రిమెంటు తీసుకోవాలని కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి బాలాజీ తెలిపారు. మండల పరిదిలోని సింగరాయపాలెంలో సోమవారం విత్తనమొక్కజొన్న పంట వేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో యాసంగి మొక్కజొన్న ముమ్మరంగా సాగు అవుతుందని పెసర , పత్తి వేసిన రైతులు రెండోపంటగా మొక్కజొన్న పంటను ప్రతి సంవత్సరం సాగు చేస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం మిరపపంటకు డిమాండ్ తగ్గడం వలన మిరపపంట తక్కువ సాగుచేశారని తెలిపారు. మొక్కజొన్న సాగు డిశంబర్ 3వ వారం వరకు వేసుకోవచ్చని జనవరి తర్వాత వేస్తే మార్చిలో ఎండలు ఎక్కువగా ఉండి మొక్కజొన్న కంకిలో గింజలు తక్కువగా ఉండి తక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ పంటకు కత్తెర పురుగు వస్తుందని దీని నివారణకు గాను ఎకరాకు 8 నుంచి 10 లింగాకార్షక బుట్టలు పెట్టుకోవాలని అన్నారు. వేప సంబంధిత వేపనూనె ఎకరాకు 500 మిల్లీలీటర్లు పిచికారి చేయడం వలన కత్తెరపురుగు అదుపులో ఉంటుందని పేర్కొన్నారు.

# సిఎం కప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే సిఎం కప్ క్రీడా పోటీల్లో పంచాయతీ , మున్సిపాలిటీ , జిల్లా , రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన దలిచిన వారు సిఎం కప్‌కు ధరఖాస్తు చేసుకోవాలని ఎంపిడీఓ ఏ రోజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్స్ , జూనియర్స్ , సబ్ జూనియర్స్ విభాగాల మొత్తం 36 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీ ,యువకులు , విద్యార్థులు , సీనియర్ క్రీడాకారులు ht pp : // cmcup2024. telangana .gov.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పోటీలలో పాల్గొనేవారికి అర్హతలు , వయసు నిర్ధారణ తదితర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచబడి ఉన్నాయని తెలిపారు.

# లక్ష్యం మేరకు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించాలి

## అంబులెన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిర్దేశిత లక్ష్యాల మేరకు జిల్లాలో హెచ్ఐవి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లాకు కేటాయించిన అంబులెన్స్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్టలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో అంబులెన్స్ ద్వారా పక్కా కార్యచరణ ప్రణాళికతో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం హెచ్ఐవి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అంబులెన్స్‌లో హెచ్ఐవి ధృవీకరణ పరీక్ష నిర్వహణకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంటాయని, పూర్తిగా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. తల్లి కావడం ఒక వరమని పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవి రాకుండా కాపాడుకోవడం మన ధర్మమని ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. తల్లికి హెచ్ఐవి పాజిటివ్ వస్తే మందుల ద్వారా పుట్టబోయే బిడ్డకు సంక్రమించకుండా నివారించవచ్చునని ఈ అంశం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి రోజు అంబులెన్స్ ఎక్కడ పర్యటిస్తుంది, పరీక్షలు ఏవిధంగా జరుగుతున్నాయి మొదలగు నివేదిక అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో రామారావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ యూనిట్ ప్రతినిధులు డి. సత్యకుమార్, ఎం. నాగయ్య, ఎండి మహమద్ అలీ, వీరయ్య, రామకృష్ణ, కౌన్సిలర్ రంగారావు, ల్యాబ్ టెక్నిషియన్ సురేష్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు రెవిన్యూ పరిధిలోని పొన్నెకల్లులోని ఖమ్మంసూర్యాపేట జాతీయ రహదారి సమీపంలోని సర్వే నెంబర్ 409లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందన్న విషయాన్ని తెలుసుకున్న రెవిన్యూ అధికారులు సోమవారం అక్కడ బోర్డు ఏర్పాటు చేపించారు. ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వే చేసి ప్రభుత్వ భూమికి హద్దులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాదు కూడదని పాల్పడితే జైలుకు పంపించడానికి కూడా వెనకడే పరిస్థితులు ఉండవన్న విషయాన్ని గుర్తెరగలని హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పంచాయతీ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇసుక ర్యాంపును ప్రారంభించిన అధికారులు



**ప్రజాపక్షం/మధిర :** మధిర మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నిడమానూరి వంశీసంధ్య ఆధ్వర్యంలో సోమవారం ఇసుక తోలకాలను అధికారులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మధిర మండలంలోని పలు ఇసుక ర్యాంపుల నుండి డ్వాక్రా సంఘాల ద్వారా తోలుకునేందుకు కలెక్టర్ ద్వారా అనుమతులు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించిగా ఇసుక ర్యాంపును ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర తహశీల్దార్ ఆర్.రాంబాబు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, ఇఓఆర్‌డి శాస్త్రి, సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు కాంగ్రెస్ నాయకులు రంగా హన్మంతరావు, అద్దంకి రవికుమార్, చావా వేణు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థినిలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఖమ్మం అర్బన్ ఎంఈవో శైలజలక్ష్మి తెలిపారు. సోమవారం ఖమ్మం అర్బన్ మండల కస్తూర్భా గాంధీ బాలిక విద్యాలయాన్ని స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబుతో కలిసి ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని వారు పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. ప్రభుత్వం సూచించినవిధంగా విద్యార్థినిలకు భోజనం అందించాలని తెలిపారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు.

## నరేంద్రస్వామికి మల్లు నందిని పూజలు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీలోని మడుపల్లి రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో డిప్యూటీసిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సోమవారం పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొని పూజలు జరిపారు. అనంతరం మధిర మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ విద్యాలత, వెంకటరెడ్డి దంపతులు మల్లు నందినిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ కోనా ధనికుమార్, కరివేద సధారర్, అనీల్‌కుమార్‌నెహ్రూ, తన్నీరు రామకృష్ణ, దారా బాలరాజు, మొండితోక సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన సిబ్బందితో ప్రత్యేక సమావేశం




**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని రైతు వేదిక నందు సోమవారం మధ్యాహ్న భోజన సిబ్బందితో మండల తహసీల్దార్, అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ స్వర్ణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే విషయంలో పరిశుభ్రత పాటించాలని, మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలని, నాణ్యమైన కూరగాయలతో రుచిగా భోజనం వండే విధంగా చూడాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందికి వారికి అందించే కేవలం పైసల్లో మాత్రమే రేట్లు పెంచుతున్నారని కానీ బయట మార్కెట్‌లో ప్రభుత్వం ఇచ్చే రేటుకు మధ్యహ్న భోజన సరుకులు కొని పెట్టలేక పోతున్నామని, ప్రభుత్వం నుండి బిల్లులు కూడా సమయానికి రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి, ఎంపీడీవో వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, అన్ని ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** గత వారం రోజులుగా ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టితో మణుగూరుకు వచ్చిన కమీషనర్ యాదగిరి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ నేపథ్యంలోమణుగూరు మున్సిపల్ కమిషనర్ ఆదేశం మేరకు మున్సిపల్ సిబ్బంది వరుసగా 7వ రోజు కూడా ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించారు. చివరి ఆక్రమణ తొలగే వరకు ఈ కార్యక్రమం సాగుతుందని ఈ సంధ్భంగా తెలిపారు. ఒక సారి తొలగించాక కూడా మళ్ళీ ఫుట్ పాత్ ను ఆక్రమించి పాదచారులకు, ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తే జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ మధు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరును పంచాయతీగా ప్రకటించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మణుగూరు అభివృద్ధి అధోగతి పాలైందని, పంచాయతీగా ఉన్న మణుగూరును మున్సిపాలిటీ చేసి సర్వనాశనం చేశారని, దీనికి పూర్తి బాధ్యత గత పాలకులదేనని మణుగూరుకు చెందిన సామాజిక కార్యకర్త లాయర్ కర్నె రవి ఆరోపించారు. గత పాలకులైన మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కానీ, ప్రస్తుత శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గాని ఈ విషయమై మణుగూరును పంచాయతీ చేయాలన్న ఇంకిత జ్ఞానం లేదని వారికి పదవులపై తప్ప ప్రజా పాలనపై ఏమాత్రం చిత్త శుద్ధి లేదని ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మణుగూరును మున్సిపాలిటీ చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ, మణుగూరును పంచాయతీ చేయాలని డిసెంబర్ 05 న స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు ప్రజా అభిప్రాయ సంతకాల సేకరణ చేసి గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి, గవర్నర్‌కి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయడం జరుగుతుందని కర్నె రవి తెలిపారు.

## సుధాకర్ మృతిపట్ల సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సిటీ కేబుల్ వ్యవస్థాపకులు, సుపరిచితులు, ఈ ప్రాంత పెద్దలు పేరుమాళ్ల సుధాకర్ (79) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మి నారాయణ, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ తదితరులు సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అయోధ్య మాట్లాడుతూ వారు మంచి వ్యక్తి అని, అందరితో ఆప్యాయంగా ఉండేవాడని, వారు చనిపోవడం చనిపోవడం బాధాకరమని. వారు ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

# వెంకటేశ్వర్లు ఆశయసాధనకు కృషి చేద్దాం

- సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్
- గూడూరుపాడులో ఘనంగా 53వ వర్ధంతి వేడుకలు





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఎర్రజెండా చేతబట్టి పేద ప్రజల పక్షాన అండగా నిలిచిన కామ్రేడ్ పుచ్చకాయల వెంకటేశ్వర్లు ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలోని స్మారకస్థూపం వద్ద 53వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన అరుణపతాకాన్ని దండి ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడారు...రాజకీయ ప్రత్యర్థులు, అధికార పార్టీ ఒత్తిళ్లను సైతం తట్టుకొని పేద ప్రజల పక్షాన అలు పెరగని పోరాటం చేసిన యోధుడు వెంకటేశ్వర్లు అన్నారు. అంతటి పోరాటపటిమను అలవర్చుకొని ప్రస్తుతం ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు రూపొందించాలన్నారు. ప్రభుత్వాలు ప్రజలు చేత ఓట్లు వేపించుకొని, గద్దెనెక్కి కార్పోరేట్లకు ఊడిగం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై విసిగి వేసారిన ప్రజలు ఎర్రజెండాలతోనే న్యాయం జరుగుతుందన్న భావనకు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 9న సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈనెల 26న జనగనున్న భారత కమ్యూనిస్టు(సి.పి.ఐ) పార్టీ 100వసంతాల వేడుకకు శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, గ్రామ నాయకులు మారుతి రామారావు, పొడేటి భాస్కర్, కర్ణం పెద్ద ఉపేందర్, ఎర్రబోయిన వెంకనర్సయ్య, వెంకటనారాయణ, మారుతి చిన్న రామయ్య, వడ్డేపూడి వెంకటేశ్వర్లు, బండి చంద్రశేఖర్, చల్లా కృష్ణ, రామకృష్ణ, సిద్దినేని బోస్, దాసరి పుల్లయ్య, ఎల్లారి నవీన్, చిర్రా ఉదయ్, నెమలి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం





**ప్రజాపక్షం/మణుగూరు రూరల్ :** రామానుజవరం మేజర్ గ్రామ పంచాయతీలోని కొండాయిగూడెం, శ్రీకృష్ణాపురం, అయోధ్య నగర్, కొత్తమల్లేపల్లి గ్రామాల ప్రజలకు సిపిఐ నాయకులు బి.అయోధ్య ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని రామనుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కంటి శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో ముప్పై మందికి కంటి ఆపరేషన్లు చేయవలసి వస్తుందని కంటి వైద్య సహాయకులు సంజీవరావు నిర్ధారించారు. ఐతే ఆపరేషన్లు హైద్రాబాద్ వెళ్ళవలసి వస్తుందని తెలపడంతో వెంటనే స్పందించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. అయోధ్య చారి తన సొంత ఖర్చులతో బస్సు మాట్లాడి పేషెంట్లను పంపిస్తానని తెలపడంతో అక్కడికి వచ్చిన వారు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 12న హైదరాబాద్ పుష్పగిరి కింటి ఆసుపత్రికి తీసుకొని వెళ్లి కంటి ఆపరేషన్లు చేపించి తీసుకొని రావడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి , టౌన్ కార్యదర్శి సుధాకర్, రామానుజవరం సర్పంచ్, తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు బాడీశ. సతీషలు పాల్గొన్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పది రోజులుగా మంచినీటి సరఫరా రాకపోవడంతో విసుగు చెందిన మహిళలు, గ్రామస్తులు రాస్తారోకో సోమవారం నిర్వహించారు. వెంకటాపురం గ్రామానికి గత పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదు. పలుమార్లు గ్రామ పంచాయితీ అధికారులకు, సిబ్బందికి తెలియజేసిన పట్టించుకోకపోవడంతో మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో తిప్పనపల్లి, సుజాతన్ రోడ్డుపై అడ్డంగా రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఎన్ని సార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని, మాకు గత్యంతరం లేక రాస్తారోకో చేశామన్నారు. గ్రామంలో యాభై ఇండ్ల వరకు ఉన్నాయని, కిలోమీటరు వరకు నడిచి నెత్తిన బిందెలతో మంచి నీరు తెచ్చుకుంటున్నామని, బాధలు భరించకలేకపోతున్నామన్నారు. ఇకపై మంచినీటి సరఫరా సక్రమంగా రాకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## లంబాడి భాషల్లో లిపిని కనుగొని ప్రాచుర్యంలోకి తీసుకురావాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** లంబాడి భాషల్లో లిపిని కనుగొని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని నేషనల్ కమిషన్ షెడ్యూల్ ట్రైబ్ సభ్యులు నిర్మ్యాపంచక్మకి మెమోరాండం సమర్పించారు. ఈసందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ మాట్లాడుతూ దేశంలో బంజారా లంబాడి మాట్లాడేవారు 10కోట్లంది ఉన్నారని, పార్లమెంట్‌లో అనేక దఫాలుగా ఎంపీలు మాట్లాడారు. అయినా లిపిని కొనుగొనడంలో నిర్లక్ష్యం వహిస్తూ భాషను కనుగొనడంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. లంబాడి భాషలో లిపి ప్రాచుర్యంలోకి వస్తే విద్యా ఉద్యోగాల్లో ప్రావీణ్యత పెరుగుతుందని ఉద్యోగ అవకాశాలు వస్తాయని భాషను కాపాడుకోవచ్చు అని అన్నారు. వినతిపై స్పందించి నిరుపంచ కర్మ స్పందిస్తూ తప్పకుండా బంజారా బాషలో లిపి రావాలని అన్నారు. ఈకార్యక్రమంలో బి వెంకన్న, ఎం కిషన్, ఏ శోభన్, వైష్ణవి , బి శోభన్, డి వినోద్, తెలంగాణ ప్రతినిధి బృందం కలిసిన వారిలో ఉన్నారు.

# దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్న బిజెపి



**ప్రజాపక్షం/ఖమ్మం:** అధికారం కోసం బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు దేశాన్ని విచ్చిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నాయని తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం ఆరోపించారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్‌లు పథకం ప్రకారం మతోన్మాదులను పెంచి పోషిస్తున్నాయన్నారు. సోమవారం మజీద్ ఎ వాయిదియా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం చేస్తున్నారని మహ్మద్ సలాం తెలిపారు. దేశంలో ఉన్న మసీదులు, దర్గాలకు సంబంధించి ఏదో ఒక పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. దేశ ప్రజలను ఐక్యంగా ఉంచి అభివృద్ధి చేయాల్సిన బిజెపి మత విభజన ద్వారా లబ్ది పొందాలని కోరుకుంటుందని ఆయన తెలిపారు. బిజెపి మతతత్వ వైఖరిని ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు ఎండి రెహ్మాన్, ఎస్‌కె మీరా, ఖాసింపాషా, అబ్దుల్ వహీద్, వజీద్, అస్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**బిజెపి కిషాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను, రైతులను దగా చేసిందని బిజెపి పార్టీ కిషాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం ఒక్క హామీ కూడా సమగ్రంగా అమలు చేయకుండా అబద్దాలడుతున్నారన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్ధానాలను విస్మరించారని, రైతుల పక్షాన నిలవాల్సిన మంత్రి తుమ్మల మాయ మాటలు చెప్పి మభ్యపెట్టి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సిఎం కేసిఆర్ చేసిన తప్పులే కాంగ్రెస్ చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల మీద చార్జ్ షీట్ వేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయటం లేదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హడావుడి తప్పా కొనుగోలు చేయటం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై ప్రతి నియోజకవర్గంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏలూరు నాగేశ్వరరావు, సాంబ, నూతక్కి నర్సింహారావు, రమేష్, స్వర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ చేశారు. సోమవారం సింగరేణి మండలలోని పంతులు నాయక్ తండ, మోట్లగూడెం, రేలకాయలపల్లి, తవిశిబోడు, ఎర్రబోడు గ్రామాలలో సీసీ రోడ్ల శంకుస్థాపన, మాణిక్యారం గ్రామంలో పోడు భూములలో వేసిన వ్యవసాయ బోర్లను ప్రారంభించారు. అనంతరం కారేపల్లి నుండి మాదారం రోడ్డును శంకుస్థాపన చేశారు. అదే విధంగా కస్తూరిబా విద్యాలయంలో మౌలిక సదుపాయాల కోసం వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఐటిడిఏ రూపొందించిన ఉద్దీపకం పుస్తకాలను శాంతినగర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, జిల్లా నాయకులు బానోత్ రామ్మూర్తి, ఇమ్మడి తిరుపతిరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ దేవులా నాయక్, గుగులోత్ భీముడు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, డైరెక్టర్లు అడ్డగోడా ఐలయ్య, బానోత్ హీరాలాల్, జిల్లా న్యాయ విభాగం నాయకులు నర్సింగ్ శ్రీనివాస రావు, మేదరి టోనీ, మాజీ సర్పంచ్ బద్రు నాయక్, పద్మ, బండారు నాగేశ్వరారవు, దూద అర్జున్‌రావు, రామ్మూర్తి, చందర్, కిసాన్ ఖేత్ కడియాల సుధాకర్, కుర్సం సత్యనారాయణ, సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చయాదేవి, నాగవేణి, మల్లెల నాగేశ్వరరావు, బోళ్ల రమేష్, నాగల్ల జగన్, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, గడ్డం వెంకటేశ్వర్లు, భావసింగ్, ఈర్య, భగవందాస్, రాందాస్, వినోద్, మంగ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలి




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ పే మంజూరు చేసి వెంటనే వారికి జీతాలు చెల్లించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథిరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసంఘం అధ్యక్షులు ఏ రామకృష్ణ అధ్యక్షతన ఎంపీ యుపిఎస్ పాతూరు పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయుల యొక్క సమస్యలన్నీ పరిష్కరించాలని, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే నియామక పత్రాలు అందించాలని, అసలు విద్యార్థులు మెనూ ఛార్జ్ పెంచాలని, 37 జీవో ద్వారా నష్టపోయిన స్థానికత కోల్పోయినటువంటి ఉపాధ్యాయులకు వారి స్థానికత ఆధారంగా పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సిఆర్‌టిల జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మండల ఎంఈఓసికే శాంతారావు, ఇప్పుడు కాంప్లెక్స్ హెడ్మాస్టర్ బి బాబులాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా విద్యాశాఖ నుండి వచ్చే అన్ని కార్యక్రమాలు పాఠశాలలో అమలు చేయాలని ఉపాధ్యాయులు అందరూ క్వాలిటీ అందుకోసం కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు చందర్‌రావు, ఏదన్న , బాబు, నాగేశ్వరరావు, సుజాత, సమ్మక్క, సరోజిని, నశ్రీన్, వేణుగోపాల్, నారాయణమ్మ, నాగు, రవీందర్, సురేష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీస్ సర్వే పెండింగ్ డబ్బులను తక్షణమే చెల్లించాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలో మండలంలో గతంలో రెండు విడతలగా సర్వే చేసిన లెప్రసీ అమౌంటు నేటి వరకు సర్వే చేసిన ఆశలకు ఇవ్వలేదు. ఈ సమస్యపై జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు అనేకమార్లు విన్నవించిన నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో మరల సర్వే చేయమని అధికారులు చెప్తున్నారు. ఆశాలు గతంలో చేసిన సర్వే అమౌంట్ చెల్లించకుండా ఇప్పుడు లెప్రసీ సర్వే చేయమని అధికారులు చెప్పడం బాధాకరమని, ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కారం చేయాలని పరిష్కారం అయ్యేంతవరకు సర్వే చెయ్యమని కోరుతూ అశ్వాపురం మెడికల్ ఆఫీసర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా నాయకురాలు ఎం కిరణ్ కుమారి, మండల కార్యదర్శి శిరీష, టి నిర్మల, టి సావిత్రి, జి రమణ పాల్గొన్నారు.

## మెరిసిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు రెండవ నేషనల్ లెవల్ ఓపెన్ కారాటే, కుంప్ ఛాంపియన్‌షిప్ 2024 నందు పాల్గొన్నారు. అఖిల్, శశిఖ్ సాయి, కేతన, అద్వైత, హస్విత, ఆన్య శ్రీ, గుల్షన్ పాషా, ఈక్షిత్, నవనీత్, పూజితా సాయి, కార్తికేయ, నిత్యాన్, సిద్ధాంత్, జ్ఞానేశ్వరిలు పాల్గొని 5 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, 3 బ్రాండ్ మెడల్స్ సాధించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమ్య, డీన్ మధు, సి ఇంచార్జ్ నాగబాబు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు.

## మోదుగు లక్ష్మీకి నివాళి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడులో సోమవారం జరిగిన మోదుగు లక్ష్మి దశదినకర్మలకు జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, మంద దేవేందర్, పోతురాజు మోహన్ రావు, సుధాకర్, వేల్పుల ముఖేష్, రవికుమార్, గ్రామస్తులు, స్థానికులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజా పాలన విజయోత్సవాలు సందర్భంగా జిల్లా విద్యాశిక్షణ కేంద్రం (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనంద ఖని) నందు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి జిల్లాస్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థి పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై నిర్వహించి వ్యాసరచన పోటీలో చొప్పకట్ల హరీంద్రనాథ వార్ధేయ అనే పదవ తరగతి విద్యార్థి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతను సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ లక్ష్మి నరసయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థి మరియు అందుకు ఎంతో కృషి చేసినటువంటి ఉపాధ్యాయురాలు/ గైడ్ టీచర్ సురపనేని శాంత కుమారిని అభినందించారు. నేడు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు గెలుపొందిన విద్యార్థి హాజరు కావలసి ఉన్నది.

## సీఎం కప్ టోర్నీకి ఎంపికైన కరకగూడెం యువకుడు



**ప్రజాపక్షం/కరకగూడెం:** పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కప్ టోర్నీ స్టేట్ కి కరకగూడెం యువకుడు గోగ్గలి లక్ష్మి ప్రణయ్ ఎంపికయ్యారు. కోచ్ నితీష్ అండదండలతో ట్రయల్లో విభాగాల్లో టోటల్ స్కోర్స్ 535, వెయిట్ లేపి స్టేట్‌లో ఆడడానికి అర్హత సాధించి, హైదరాబాద్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. సిల్వర్ మెడల్ సాధించి రానున్న స్టేట్ మీట్లో ఎంపికయ్యారు. ఈ నెలలో 30 తారీఖున సీఎం కప్ టోర్నమెంట్లలో విజయం సాధించాలని తల్లిదండ్రులు గొగ్గలి రవి పద్మ ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు అభినందించారు. ఈ అవకాశం వచ్చినందునగోగ్గలి లక్ష్మి ప్రణయ్ సంతోషం వ్యక్తం చేశారు.

# చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-ఎస్‌బిఐటిలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నష్ట పోవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై జరిగిన సదస్సులో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఉదయం సమయంలో ధ్యానంతో పాటు శారీరక శ్రమ అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను, సవాళ్లను సులువుగా ఎదుర్కొని వచ్చున్నారు. ప్రస్తుత కాలంలో యువత ఒత్తిడి కారణంగా చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను నష్టపోవడంతో పాటు ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు నైరాశ్యాన్ని మిగులుస్తున్నారన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తోటి స్నేహితులు ఎవరైనా వ్యసనాలకు లోనైతే వారి వివరాలను సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు. తద్వారా వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడిన వారవుతారని కలెక్టర్ తెలిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ దృష్టిని విద్యపై, తమ భవిష్యత్తుపై కేంద్రీకరించాలని, చెడు అలవాట్లకు గురి కావద్దని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ మృణాల్ ఠాకూర్‌ను కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ సత్కరించారు. డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంగోపాల్‌రెడ్డి, డిసిపివో విష్ణువందన విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లిలో 15వ విడత సామాజిక తనిఖీ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీని సోమవారం నిర్వహించారు. పెనుబల్లి మండల అభివృద్ధి కార్యాలయంలో డిఆర్డిపి అడిషనల్ పిడి శిరీష నేతృత్వంలో సోమవారం ప్రజా వేదిక ఓపెన్ ఫోరం నిర్వహించారు. పెనుబల్లి మండలంలోని 33 గ్రామపంచాయతీ ఉపాధి హామీ పథకం కూలీలు, నర్సరీలు వంటి అంశాలపై 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐదు మంది టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శుల, రికార్డుల నివేదికలను పరిశీలన కొనసాగించారు. కడపటి సమాచారం మేరకు 16 గ్రామ పంచాయతీల నివేదికలను పూర్తి చేశారు. ఈ క్రమంలో రూ. 66,792 జరిమానా విధించి 42 వేల రూపాయలు రికవరీ చేశారు. నర్సరీల నుండి రూ. 22 వేలు, ఈజీఎస్ నుండి రూ.19 వేలు రికవరీ చేసినట్లు డిఆర్‌డిఎ ఏపీవో శిరీష తెలిపారు. మిగిలిన పంచాయతీల తనిఖీల అనంతరం పూర్తి నివేదికను తెలియజేయడం జరుగుతుందని, ఈ తనిఖీ నివేదికలలో కొందరి సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని గుర్తించినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఎస్ క్యూ డిఒ డి. వీరయ్య, అంబుడ్స్ పర్సన్ రమేష్ బాబు, ఎస్‌ఆర్పి సాంబశివ చారి, యాదాద్రి, ఏపిఎం పవన్, డీఈవో సక్రియ, ఈజీఎస్ ఏపిఓ విజయబాబు, రంగనాయకమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్, అసిస్టెంట్లు పాల్గొన్నారు

# ఏడో తేదీ నుంచి సిఎం కప్ క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ క్రీడల్లో విజేతలుగా నిలిపేందుకు సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపారు. సిఎం కప్ 2024 పేరిట ఏడు, ఎనిమిది తేదీలలో గ్రామస్థాయిలో 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి రెండు వరకు రాష్ట్ర స్థాయిలో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో యువతీ, యువకులకు ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా సంబంధించి పోటీలను నిర్వహించనుండగా జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్ సహా 20 క్రీడల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 37 క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయని సునీల్‌రెడ్డి తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత అధికారులు ఈ క్రీడలను నిర్వహిస్తారని వ్యక్తిగత అంశాలకు సంబంధించి మొదటి బహుమతి రూ. 20వేలు, ద్వితీయ రూ. 15వేలు, తృతీయ రూ.10వేలు అందజేయనున్నామన్నారు. టీమ్ గేమ్స్‌కు సంబంధించి మొదటి బహుమతి లక్ష రూపాయలు, ద్వితీయ బహుమతి రూ. 75 వేలు, తృతీయ బహుమతి రూ. 50వేలు అందజేయనున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా కేంద్రాలలో సంప్రదించవచ్చునని సునీల్ రెడ్డి తెలిపారు.

# దాతల వితరణతో అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో సోమవారం ఘనంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. జమలాపురం గ్రామానికి చెందిన అబ్బీర పకీరు బాలమ్మ కుమారుడు శ్రీనివాసరావు, పద్మ కుమార్తె దీపిక కుమారుడు వినయ్, సాయిమాధవ ఏజెన్సీస్ నారాయణపురం అయ్యప్పస్వాముల బృందం వితరణతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎల్ ఉపాధ్యక్షునిగా పట్టాభి, కార్యదర్శులుగా లతీఫ్, శేషగిరి





**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది పెమ్మసాని పట్టాభి ఎన్నికయ్యారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర మహాసభలు రెండు రోజుల పాటు హన్మకొండలో జరిగాయి. ఈ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఖమ్మంకు చెందిన పట్టాభితో పాటు జిల్లా ఐఏఎల్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఒరుగంటి శేషగిరిరావు రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది అమర్‌చంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కాగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మేకల నవీన్‌కుమార్, జివి లక్ష్మి నారాయణ, ఎం. దామోదర్‌బాబు, షేక్ నసీన్, జి. అమర్‌నాథ్, కె. శరత్‌బాబు, కె. శివకుమారి, ఆర్. మహేష్, సతీష్, మధు, అరుణ, ఇమామలి, వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు. న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెల ఉపకార వేతనం రూ.10వేలు అందించాలని, ఇతర సదుపాయాలు కల్పించాలని తీర్మానం చేసినట్లు వారు తెలిపారు.

# దూకుడుగా ఆయిల్‌ఫామ్ గెలల ధర



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఆయిల్‌ఫామ్ గెలల ధర దూకుడు కొనసాగుతుంది. గత మూడు నెలల్లో టన్నుకు రూ.6వేలకు పైగా ధర పెరగటంతో ఆయిల్‌ఫామ్ సాగు రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ నెలలో ఆయిల్‌ఫామ్ గెలలు టన్ను ధర రూ.19,144 ఉండగా, నవంబర్ నెలలో రూ.1269 పెరిగి రూ.20,413 పెరిగినట్లు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ప్రకటించింది. ఆయిల్‌ఫామ్ ధరల పెరుగుదలకు కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కుష్టువ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం /తల్లాడ :** కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రత్నమనోహర్ అన్నారు. సోమవారం కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో స్థానిక ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికైనా అనుమానాస్పద మచ్చలు, రాగి వర్ణపు స్పర్శ లేని మచ్చలు ఎవరికైనా ఉన్నట్లయితే వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రులకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరూ ఈ అవగాహన కలిగి ఉండి వైద్యాధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నీష్మ, శాస్త్రి, పిహెచ్‌సి సూపర్వైజర్స్ భాస్కర్, పెద్ద పుల్లయ్య, ఝాన్సీ లక్ష్మీ, భద్రమ్మ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అని చెప్పి మోసం చేసిందని అన్నారు. కానీ హామీలు హామీలుగా నే మిగులుతున్నాయని అన్నారు. అబద్దాలతో ప్రభుత్వం పబ్బం గడుపుతుందని అన్నారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భువనాసి దుర్గారావు, కల్యాణం నాగేశ్వరరావు, తోగాటి నాగచారీ, కొండ హర్ష, గెల్లా నాగ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా నాయకులు పుష్కర్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు గా ఉన్న రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన లు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. వీరికి వివిధ సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం తమ పట్ల సానుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాంబశివరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, మీరా, అనిత తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కాంతులతో ఐడిఓసి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఐడిఓసి (జిల్లా కలెక్టర్ కార్యాలయం) విద్యుత్ దీపాల కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. కార్యాలయపు బయటి భాగం మొత్తంగా రంగురంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. దీంతో ఆప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. పాల్వంచకొత్తగూడెం జాతీయ రహదారిపై ఐడిఓసి కార్యాలయం ఉండటంతో ఆ విద్యుత్ కాంతులను చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

# ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపి వద్దిరాజు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉప రాష్ట్రపతి జగదీష్ ధన్కర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఆయన ఉప రాష్ట్రపతిని కలిసి రాష్ట్ర సమస్యలు వివరించారు.

# భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు మెడికల్ కళాశాల నిర్మాణం




**-ఏడున ఆరోగ్యశాఖ మంత్రిచే శంకుస్థాపన**
**-తెలంగాణను ఆయిల్ పాం హబ్‌గా మార్చడమే లక్ష్యం**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు ఖమ్మంలో ప్రభుత్వమెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ఈనెల ఏడున వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మెడికల్ కళాశాల భవన నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆయిల్ పాం సాగుతో రైతులను రాజుగా మార్చడమే తన లక్ష్యమన్నారు. రైతులకు నష్టం లేకుండా లాభాలు వచ్చే పంట ఆయిల్ పాం అని తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన నాటికి పామాయిల్ గెల ధర రూ. 20వేలు దాటడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆయిల్ పాం హబ్‌గా మార్చడమే తన జీవిత లక్ష్యమన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పొలం బాట పట్టేలా ఆయిల్ పాం సాగును విస్తరించాలన్నారు. తన చిరకాల కోరికైన సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మంజిల్లాను సస్య శ్యామలం చేయడమే లక్ష్యమని వచ్చే ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్టు సాగునీటిని అందిస్తామని తెలిపారు. తాను 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జాతీయ రహదారుల కోసం, నీటి పారుదల కోసం, క్యాబినెట్‌లో పనిచేసే అవకాశం లభించిందన్నారు. రైతు బిడ్డనైనా తనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసే అవకాశం కల్పించారన్నారు. ఆయిల్ పాం సాగుతో ఉద్యాన వన పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సహం అందిస్తామన్నారు. రూ. 66 కోట్లతో రఘునాథపాలెం మండలంలోని చెరువులకు సాగర్ జలాలతో నింపేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులు కల్పించడం, మెడికల్ కళాశాలలో సీట్ల పెంపుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ప్రతిపాదనలు అందించినట్లు తెలిపారు. విద్యా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన స్వామినారాయణ్ ట్రస్టు గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని అందుకు అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించినట్లు తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలు కోరినట్లు ఖమ్మంకు ప్రగతి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. అరాచకం, అక్రమాలు లేని ఖమ్మంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, సిపి సునీల్ దత్,జెడ్పి సిఈవో దీక్షారైనా, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని పిఆర్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కట్ట శేఖర్, ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులైన సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఐఈఆర్‌పిలు, మెసెంజర్లు రెండు రోజులుగా అన్ని మండలాల్లో దీక్ష చేపట్టారు. ఖమ్మం అర్బన్ , రఘునాథపాలెం మండల, డిపిఆర్‌వో స్టాఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరాన్ని సోమవారం కట్ట శేఖర్, గుడిపూడి శ్రీనివాసరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖకు మూల స్తంభం లాంటి సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. మూల వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, సాధారణ సెలవులు మంజూరు చేయాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఐఈఆర్‌పిలు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్స్‌ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పెన్షన్ ఇవ్వాలి



**జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కి ఏఐపీకేఎంఎస్ వినతి**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సమాజంలో గౌరవప్రదంగా అందరితో సమానంగా జీవించవలసిన కొందరు అనుకోకుండా ఎనాపిల్ అనే దోమ కుట్టడం ద్వారా ఫైలేరియా వ్యాధి సోకి ఇబ్బందులు ఎదుర్కొంటూ దుర్భర జీవితం గడుపుతున్నారని ప్రభుత్వం వారిని శాశ్వత వికలాంగులుగా గుర్తించి పదివేల రూపాయల పెన్షన్ అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు జిల్లా కలెక్టర్ ముజామిల్ఖాన్ కి వింతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైలేరియా వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో విఫలమయ్యారని వెంటనే వారిని గుర్తించి ఫైలేరియా ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని వారిని శాశ్వత వికలాంగులుగా గుర్తించి వారికి ప్రభుత్వమే సదరం క్యాంపు పత్రం మంజూరు చేసి పదివేల రూపాయల ఫంక్షన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ఫైలేరియా వ్యాధి ప్రబలకుండ చర్యలు తీసుకుంటామని ఫైలేరియా సోకిన వ్యాధిగ్రస్తుల్ని గుర్తించి పెన్షన్ అమలు అయ్యేవిధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, బోదకాలు బాధితులు గొర్రెపాటి నాగమ్మ, దారమళ్ళ వెంకన్న, తిమ్మిడి రఘుబాబు, బొల్లం ఉప్పమ్మ, పులిపలుపుల వెంకటమ్మ, ఉమా, గంగరబోయిన ఉప్పమ్మ, గుజ్జ అనసూయ, రామచంద్రు, వీరయ్య తదితరులు ఉన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సైదాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** డిసెంబర్ 4, 5 తేదీల్లో పాల్వంచలో జరిగే రాష్ట్ర సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల కోటేశ్వరరావు సోమవారం జూలూరుపాడులో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 2009 నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ప్రస్తుతం ప్రమాద మరణంకు రూ. 6.30 లక్షలు, సహజ మరణంకు రూ. 1.30 లక్షలు, వివాహ ప్రసూతి కానుక రూ. 30,000 చొప్పున తదితర సంక్షేమ పథకాలు బోర్డు ద్వారా ప్రభుత్వ అందిస్తుందని, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్, పిల్లలకు స్కాలర్షిప్‌లు సొంత గృహ వసతి పథకాలు అమలు చేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం కానీ ఉన్న సంక్షేమ పథకాలు నిధులు పెంచడం కానీ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో పాల్వంచలో డిసెంబర్ 4, 5 తేదీల్లో జరిగే రాష్ట్ర సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సిలివేరి నరసింహారావు, గుడిమెట్ల సీతయ్య, రామారావు వెంకటేశ్వర్లు, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కెవిజిబిలోని ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రంలోని కెజిబివిపాఠశాల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషలాఫీసర్ సరిత సోమవారం తెలిపారు. పదవ తరగతి వరకు సిఆర్జిలో ఇంగ్లీష్, మ్యాథ్స్, బయోసైన్స్, ఫిజికల్ కెమిస్ట్రీ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరారు. బిఎస్సీ, బిఇడి అర్హతల గల ఇంగ్లీష్ మీడియాలో బోధించగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా జూనియర్ కాలేజిలో కెమిస్ట్రీ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందని, బిఇడి పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఏదైనా కాలేజిలో ఒక సంవత్సరం బోధించిన అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులకు మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు తమకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్స్‌ను జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల లేదా 9652343885 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

# పాఠశాలల సందర్శన



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి, మండలంలోని జీళ్ళ చెరువు ఉన్నత పాఠశాలలను సోమవారం నాడు రాష్ట్ర విద్యా కమిటీ చైర్మన్ ఆకునూరి మురళి పరిశీలించా రు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇంకా సౌకర్యాలు కావాలంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఎలా అందుతుందని పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఘటనలను విద్యాశాఖ సీరియస్ గా తీసుకుందని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు ఇచ్చే వేతనాలు కూడా లేటుగా అందుతున్నాయని ఆయన చెప్పారు. ఈనెల పదిలోపు రిపోర్ట్ ను ప్రభుత్వానికి అందిస్తామని ఆయన పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ఎస్ఓపి ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న బోజన పథకాన్ని ఎలా అందుతుందో ఆయన పరిశీలించారు.

# కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని ప్రజావాణిలో వినతి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొత్త పెన్షన్లు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ప్రజావాణిలో తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఎంపీడీవో ఎస్‌కే సిలార్ సాహెబ్ కు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొమ్ము వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వృద్ధులు వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు కొత్త పెన్షన్ల కోసం సుమారు 900 మంది దరఖాస్తులు చేసుకున్నారని వారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేయడంలో విఫలమైందని, వెంటనే పెన్షన్ మంజూరు చేసి వారి ఆదుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో వివిధ అవసరాల కోసం సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, యాదగిరి, నవీన్, కె.నాగేశ్వరరావు, కే.శంకర్, బి.లక్ష్మీనారాయణ, పి.రామారావు, కె.నాగేశ్వర రావు, నెరుసుల వెంకటేష్, కే.వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** మారుమూల గిరిజన ప్రాంతాల నుండి అర్జీలు పెట్టుకునే గిరిజన కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి ఆయా శాఖల అధికారులకు బదాలాయించారు. అనంతరం ఏపిఓ మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏలో వివిధ యూనిట్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాడు నేడు కార్మికవర్గానికి ఎర్రజెండానే అండ



- ఏఐటియూసినే శ్రామిక జీవులకు భరోసా
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా
- పార్టీ సభ్యత్వాన్ని అందించిన హమాలీ ముఠా సభ్యులు

ప్రజాపక్షం/భద్రాచలం : నాడు నేడు కార్మిక వర్గానికి ఎర్రజెండానే అండగా ఉంటుందని, భవిష్యత్‌లో ఇదే ఒరవడి కొనసాగుతుందని ఏఐటియూసి జిల్లా గౌరవఅధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పెద్దబజార్ హమాలీ కార్మికుల సిపిఐ 2025 సభ్యత్వ పునరుద్ధరణ రుసుమును సోమవారం పెద్ద బజార్‌లో జరిగిన సమావేశంలో అందజేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ హమాలీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చాలీచాలని వేతనాలతో బ్రతుకు సాగిస్తున్న హమాలీ కార్మికులను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, భవన నిర్మాణ కార్మికుల తరహాలో సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించాలని, అసంఘటిత కార్మికులు ఆందోళన నిర్వహిస్తుంటే కేంద్రం పెడచెవిన పెడుతోందన్నారు. హమాలీ కార్మికులు ఏఐటియూసి ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములై సమగ్ర సంక్షేమ చట్టం, చట్టబద్ధ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగిలి, జగదీష్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చలి ప్రభావం నుండి వరి నారుమడిని సంరక్షించుకోవాలి



ప్రజాపక్షం/కూసుమంచి : మండలంలోని నాయక న్ గూడెం గ్రామంలో సోమవారం నాడు వరి నారుమళ్లను మండల వ్యవసాయ అధికారిని రామడుగు వాణి సందర్శించి రైతులకు తగు సలహాలు సూచనలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యాసంగిలో చలి ప్రభావం వలన నారుమడులలో నారు సరిగా ఎదగకపోవడం ఆకులు పసుపు ఎరుపు రంగుకు మారడం, అక్కడక్కడ నారు చనిపోవడం వంటివి జరుగుతుంటాయనీ, కావున రైతులు యాసంగిలో కొన్ని మెలకువలను పాటించి నారుమడిని సంరక్షించుకోవాలనీ తెలిపారు. ముఖ్యంగా సాయంత్రం వేళలో నారుమడిలోని నీటిని తీసేసి ఉదయం వెచ్చని నీటిని పెడుతుండాలనీ, చలి తీవ్రత అధికంగా ఉన్న రోజుల్లో నారుమడి చుట్టు ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలను అమర్చి పలుచటి ప్లాస్టిక్ షీట్ ను లేదా కల్లాలపై కప్పే పట్టాలను కప్పి మరుసటి రోజు ఉదయం తీసివేయాలనీ సూచించారు. యాసంగిలో జింకు లోపం కూడా ఉండే అవకాశం ఉన్నందున జింకు సల్ఫేటు లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని, నారుమడి ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వాడేటప్పుడు ఒక కిలో యూరియా కి రెండు గ్రాముల కార్బెండజం మరియు మాన్కొజెబ్ మందులు కలిపి పిచికారి చేయాలనీ తెలిపారు. ముఖ్యంగా కాండం తొలిచే పురుగు బారిన పడకుండా ఉండడానికి ఎకరానికి సరిపడా నారుమడికి ఒక కిలో కార్బోఫ్ యూరాన్ 3జీ విడుదలు తప్పనిసరిగా వినియోగించాలనీ, మరల నాట్లు వేసిన 15 నుండి 20 రోజుల సమయంలో ఎకరానికి 10 కేజీల చొప్పున కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను తప్పనిసరిగా వాడటం వల్ల కాండం తొలిచుపురుగును సమర్థవంతంగా నివారించవచ్చనీ తెలిపారు. చలి తీవ్రత అధికమైనప్పుడు అగ్గి తెగులు ఆశించే అవకాశం కూడా ఉన్నందున ముందు జాగ్రత్తగా ట్రైసైకిల్స్ లీటర్ నీటికి 0.6 గ్రాములను కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ విధమైన సస్యరక్షణ చర్యలను పాటించడం వల్ల చలి తీవ్రత నుండి వరి నారుమడిని సంరక్షించుకోవచ్చని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కంచర్ల ప్రవీణ్ రెడ్డి , మధుసూదన్ రెడ్డి, చిత్తారి వెంకన్న, కిన్నెర భూమయ్య పాల్గొన్నారు.

# ప్రజావాణికి డుమ్మా కొడుతున్న అధికారులు




హాజరుకాని అధికారుల నివేదిక పంపుతాం : తహశీల్దార్

ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను తెలుసుకొని నేరుగా పరిష్కారం చేసే దిశగా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. సోమవారం వైరా తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పలు శాఖల అధికారులు హాజరుకాకుండా డుమ్మా కొట్టారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్యలను ప్రజలు వివరించుకునేందుకు అన్నిశాఖలకు సంబంధించిన అధికారులను ప్రజావాణి కేంద్రాల వద్ద ఉండాలని ప్రభుత్వం ఆదేశించిన ఆదేశాలు కూడా కొందరు అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజావాణి కార్యక్రమానికి కొంతమంది ఆఫీస్ సిబ్బందిని పంపిస్తున్నారు. అంటే సమస్యలు తెలుసుకోవాల్సిన అధికారి రాకుండా ఆఫీసులో పని చేసే స్వీపర్ వద్ద నుంచి అటెండర్ వరకు ఇలా కొందరు అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి పంపిస్తున్నారు. కొందరు రాకుండా డుమ్మా కొడుతుంటే కొంతమంది నామమాత్రంగా పోయామా లేదా అనే విధంగా కార్యాలయంలో సిబ్బందిని పంపిస్తున్నారు. మరి కొంతమంది ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ప్రజలు వినతులు ఇవ్వకముందే రిజిస్టార్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారు. ఇదేనా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పెట్టిన ప్రజావాణి పట్ల అధికారులు పనితీరు. సమస్యలను తెలుసుకునేంత సమయం కూడా అధికారులకు దొరకడం లేదా. కార్యాలయానికి రావడం లేదా మరి ఎందుకు ప్రజావాణికి హాజరు కావడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రజావాణిని పలుసార్లు హెచ్చరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదేవిధంగా అధికారులు ప్రజావాణికి డుమ్మా కొడితే ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేది ఎలా. సుమారు 27 శాఖల అధికారులు ప్రజావాణికిహాజరు కావాల్సిన ఉండి వచ్చింది. మాత్రం 17మంది అందులో కార్యాలయ సిబ్బంది ఎక్కువ శాతం ఉన్నారు. రావాల్సిన మాత్రం అధికారులు రాలేదు. పదిమంది 10 శాఖల అధికారులు ప్రజావాణిలో కనిపించలేదు. అటవీశాఖ, బిసి వెల్ఫేర్, ఎస్సీ, డవలప్‌మెంట్ ఆఫీసర్స్, మత్స్యశాఖ, హార్టికల్చర్, ఉమెన్ చైల్డ్ డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్ డిపార్ట్‌మెంట్, రూరల్ డవలప్‌మెంట్, విద్యుత్‌తో పాటు పలు శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనలేదు.

# వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు వితరణ




ప్రజాపక్షం/వైరా: వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఫనిత లక్ష్మి రాయి, రవళి మహిళలకు వైరా లయన్స్ కంటి ఆసుపత్రినందు ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణచేతుల మీదుగా తోపుడు బండ్లను(పుష్కార్ట్) సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ కోఆర్డినేటర్ వుంద్రుశ్యామ్‌బాబు, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లగడపాటి ప్రభాకర్‌రావు, క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, చెరుకూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యావికాసానికి ఐటిడిఏ పిఓ ఆలోచనలు ఎంతో మేలు : పొంగులేటి



ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన విద్యార్థుల విద్యావికాసానికి ఐటిడిఏ పిఓ అనుసరిస్తున్న విధానం ఎంతో మేలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని మండల పర్యటనలో భాగంగా ఐటిడిఏ రూపొందించిన ఉద్దీపన పుస్తకాలను ఎంఎల్ఏ కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా పాఠాలు నేర్చుకునేందుకు ఉద్దీపన ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. అంతకు ముందు ఐటిడిఏ పిఓ రాహుల్ మండలంలోని ముత్యంపాడులోని జిపిఎస్ పాఠశాల, కోయగూడెంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం వేడివేడి ఆహారపదార్థాలను వడ్డించాలన్నారు. ఉద్దీపన పుస్తకాలను పిల్లలతో రాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక




ప్రజాపక్షం/భద్రాచలం : అన్ని ఉపాధ్యాయ సంఘాలకు మాతృసంఘంగా గుర్తింపు పొందిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియూ టిఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా బి మంగీలాల్ (సుజాతనగర్ మండలం), ప్రధాన కార్యదర్శిగా ఎండి లాల్ అహ్మద్ (పాల్వంచ మండలం)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా బి చందర్, గౌరవ సలహాదారునిగా కె సుధాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం జ్యోతిరాణి, ఏ మోహన్, బి బోజ్యాలాల్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా జి శంకర్, బి గోపాల్, ఉపాధ్యక్షులుగా బి.శ్రీను, ఎస్ లక్ష్మయ్య, బి వెంకట్, కార్యదర్శులుగా ఎం సత్యనారాయణ, బి రాజువల్, మహిళా కార్యదర్శిగా దీనమ్మ, కోశాధికారిగా బి.సుబ్బారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పెండింగ్ డిఏలను తక్షణమే విడుదల చేయాలని, డిపిఎఫ్, టిఎస్ జీఎల్ఐసి లను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని, ఎప్పటికప్పుడు వివిధ రూపాల్లో ఏర్పడే ఖాళీలను సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతులతో భర్తీ చేయాలని,317 జీఓ ద్వారా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులందరి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలని, ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, స్పెషల్ టీచర్లందరికీ నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఎస్‌జిటిలకు ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని, జిల్లా కేంద్రంలో ఎస్ఎస్‌సి స్పాంట్ వాల్యుయేషన్ సెంటర్ ఇవ్వాలని, సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అన్నారు.

# ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ షరతులు లేకుండా చేయాలి : యర్రా బాబు




ప్రజాపక్షం/వైరా: 2023 డిసెంబర్11వ తేదీ లోపు రైతులు తీసుకున్న బ్యాంకు వ్యవసాయ రుణాలు రూ.2లక్షల వరకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సిపిఐవైరా నియోజకవర్గ కార్యదర్శి యర్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం వైరా సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో యర్రబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, కాని నేడు రూ.2లక్షల పైన అప్పు ఉన్న రైతులకు అప్పు ఎక్కువ ఉందని పేరుతో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా వదిలేయడం సరైంది కాదని, అటువంటి రైతులకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. ఇప్పటికి రెండు దఫాలుగా రావాల్సిన రైతుబంధు రాక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం మాఫీ రాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మాఫీ ఇవ్వాల్సిన రూ.2లక్షలు ఇస్తే మిగతా అప్పు పంటలు చేతికొచ్చిన తర్వాత చెల్లించుకొని రైతులు రుణాల విముక్తులు అవుతారని అన్నారు. కేవలం ఒక లక్షలోపు అప్పు ఉన్న రైతులకు ఒక సంవత్సర కాలంలో అనగా గత ప్రభుత్వంలో రూ.2లక్షలలోపు ఉన్న ప్రస్తుత ప్రభుత్వంలో రెండుసార్లు ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా మాఫీ ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం అవుతుంది తప్ప మరొకటి కాదన్నారు. ప్రభుత్వం పరిశీలించి ప్రతి రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మిగతా రైతులు అందరూ ఆందోళన చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, రాఘవరావు, కొండారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.